క్లుప్తంగా

రూ.6.70 లక్షల స్త్రీనిధి నిధుల రికవరీ

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెంలో దుర్వినియోగమైన రూ.6.70 లక్షల స్త్రీనిధి నిధులను రికవరీ చేసినట్టు మండల స్త్రీనిధి బ్యాంకు మేనేజర్ వి.సురేంద్ర గురువారం తెలిపారు. గత ఏడాది అప్పటి సీసీ మురళి హయాంలో అప్పటి వీఓఏ కొల్లు దుర్గాభవాని ఈ నిధులు దుర్వినియోగం చేసినట్టు గుర్తించారని పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి, మురళిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుని, పి.గన్నవరం మండలానికి బదిలీ చేశారన్నారు. బాధ్యురాలైన వీఓఏ దుర్గాభవానీని విధుల నుంచి తొలగించారన్నారు. దుర్వినియోగమైన నిధులను ఆమె నుంచి దఫదఫాలుగా వడ్డీతో సహా ఈ నెల 12వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో రికవరీ చేశామని సురేంద్ర వివరించారు.

అయినవిల్లి దేవస్థానానికి నూతన పాలకవర్గం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి దేవస్థానానికి తొమ్మిది మంది సభ్యులతో నూతన పాలకవర్గాన్ని నియమించారు. జి.నాగేశ్వరరావు, హేమలత, డి.వెంకటేశ్వరరావు, వి.రామచంద్రరాజు, పి.మంగాదేవి, కె.మంగాదేవి, కె.దుర్గమ్మ, ఎస్.వెంకటరమణ, డి.మంగతాయారు నియమితులయ్యారని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు గురువారం తెలిపారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా అయినవిల్లి సూర్యనారాయణమూర్తిని నియమించారన్నారు. త్వరలో పాలకవర్గం సమావేశమై వీరిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకోనుందని తెలిపారు.

బిళ్లకుర్రులో నేడు ప్రారంభోత్సవాలు

కొత్తపేట: బిళ్లకుర్రు గ్రామంలో రూ.1.03 కోట్లతో చేపట్టిన వివిధ నిర్మాణాలను అమలాపురం ఎంపీ చింతా అనురాధ, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నారని సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు గురువారం తెలిపారు. రూ.25 లక్షలతో సచివాలయ భవనంపై విభాగం, రూ.17.5 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనంతో పాటు పంచాయతీ నిధులు రూ.30 లక్షలతో నిర్మించిన 4 సీసీ రోడ్లు, రూ.20 లక్షలతో నిర్మించిన 4 సీసీ డ్రెయిన్లు, పంచాయతీ, మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయిన్లను ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభిస్తారని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యాన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందన్నారు.

నాక్ బృందం సందర్శన

కొత్తపేట: మూడోసారి నాక్‌కు వెళ్తున్న సందర్భంగా స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ బృందం గురువారం సందర్శించింది. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ నుంచి నాక్ బృందం అధికారులు ఓఎస్డీ డాక్టర్ కె.విజయబాబు, అకడమిక్ ఆఫీసర్ ఇ.వరప్రసాద్ కళాశాలలోని అన్ని విభాగాలనూ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు ఆధ్వర్యాన వివిధ విభాగాల అధిపతులు నాక్‌లో అత్యున్నత గ్రేడింగ్ అర్హతలను వివరించారు. నాక్ గుర్తింపునకు తయారు చేసిన డాక్యుమెంట్లు సమర్పించారు.

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు

మామిడికుదురు: ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయం అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై ఎనిమిది రోజుల శిక్షణ తరగతులు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రారంభమయ్యాయి. ఎంపీపీ కుసుమ వనజకుమారి అధ్యక్షతన ప్రారంభ సభ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 30 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయం, మార్కెటింగ్ సదుపాయం, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై సమగ్రంగా శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఏఓ కె.శ్రీనివాస్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిట్టిబాబుకు ఆర్డీఓ పరామర్శ



ఎమ్మెల్యే చిట్టిబాబును పరామర్శిస్తున్న ఆర్డీఓ

మామిడికుదురు: అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొంది, నగరంలోని స్వగృహానికి వచ్చి, విశ్రాంతి తీసుకుంటున్న పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును కొత్తపేట ఆర్డీఓ ముక్కంటి గురువారం పరామర్శించారు. ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేకి అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆశీస్సులను ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యాన అర్చకులు అందించారు. ఎమ్మార్పీఎస్ఎస్ వ్యవస్థాపకుడు తెన్నేటి కిశోర్ మాదిగ కూడా ఎమ్మెల్యే చిట్టిబాబును పరామర్శించారు.

పాస్టర్ల బృందానికి స్వాగతం

సఖినేటిపల్లి: ఐదు నెలలుగా అల్లర్లతో అట్టుడుకుతున్న మణిపూర్ బాధితులకు సాయం అందించి, స్వగ్రామాలకు చేరుకున్న పాస్టర్ల బృందానికి సఖినేటిపల్లి పాస్టర్ల ఫెలోషిప్ ప్రతినిధులు, కుటుంబ సభ్యులు, యూత్ గురువారం ఘన స్వాగతం పలికారు. మండల పాస్టర్ల ఫెలోషిప్, అంతర్వేదికర పాస్టర్లు ఫెలోషిప్, ఐపీసీ సభ్యులు, జీడీఎం, లూథరన్, ఇండిపెండెంట్ సంఘాల సహకారంతో పాస్టర్లు గంటా ఛార్లీ షారోన్ కుమార్, దేవ ప్రవీణ్, నోబుల్ ప్రవీణ్, రాజేష్, ఎన్.అశోక్, ఎన్.రాజు ఈ నెల 3న మణిపూర్ వెళ్లారు. తొమ్మిది రోజులు అక్కడే ఉండి బాధితులకు నిత్యావసర సరకులు, పప్పులు, దుప్పట్లు, దోమ తెరలు, కొంత నగదు అందజేశారు.

పింఛన్ల పండగ



చెముడులంకలో సామాజిక పింఛన్లు అందుకున్న వారితో కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



సఖినేటిపల్లిలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

- నూతనంగా ఎంపికైన లబ్ధిదారులకు పంపిణీ
- ప్రారంభించిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

ఆలమూరు/సఖినేటిపల్లి/రావులపాలెం/మామిడికుదురు/అంబాజీపేట/అయినవిల్లి/మలికిపురం: వైఎస్సార్ పెన్షన్ కానుకకు నూతనంగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ గురువారం పండగ వాతావరణంలో జరిగింది. ఆలమూరు మండలం చెముడులంక గ్రామంలో ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో అర్హులైన వారందరికీ కులమత రాజకీయాలకు అతీతంగా సామాజిక పింఛన్లు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. గతంలో వృద్ధాప్య పింఛన్ వయసు 65 ఏళ్లు ఉండగా సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే దీనిని 60 ఏళ్లకు తగ్గించి అవ్వాతాతలకు న్యాయం చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తేనో లేక అధికార పార్టీ కండువా కప్పుకుంటేనో అనే విధంగా కాకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్లు అందిస్తోందని చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 45 వేల మందికి ప్రతి నెలా దాదాపు రూ.10 కోట్లు పైనే పింఛన్లు అందజేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రికార్డు స్థాయిలో కొత్తగా 2,234 మందికి పింఛన్లు మంజూరయ్యాయని చెప్పారు. ఆలమూరు మండలంలో 581, ఆత్రేయపురం 536, కొత్తపేట 581, రావులపాలెం మండలంలో 536 మందికి నూతన పింఛన్లు మంజూరయ్యాయన్నారు. వారందరికీ ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పింఛన్లు అందజేస్తారని జగ్గిరెడ్డి తెలిపారు. సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యులు తోరాటి సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- అర్హులందరికీ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సఖినేటిపల్లి మండలంలో కొత్తగా మంజూరైన 237 పింఛన్లను మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్‌ను మరోసారి అధికారంలోకి తెచ్చుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి.భీమారావు, వైస్ ఎంపీపీలు రాపాక దీవెన కుమారి, రుద్రరాజు చినరాజా, ఎంపీటీసీ సభ్యులు మందపాటి రత్నం, కో ఆప్షన్ మెంబర్ బళ్ళ నోబుల్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.
- రావులపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో గ్రామంలోని ఐదు సచివాలయాల పరిధిలో 106 మందికి నూతన పింఛన్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, ఎంపీటీసీ సభ్యులు కోట విజయకుమారి, దొండపాటి వీర్రాజు, జక్కంపూడి సత్యవతి, గూటం తిమోతి ప్రకాశరావు, పంచాయతీ వార్డు సభ్యులు వెలగల సత్యనారాయణరెడ్డి, కోట శ్రీలక్ష్మి, కోనాల రాజ్‌కుమార్, గెద్దాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- మామిడికుదురు మండలంలోని 18 గ్రామాల్లో కొత్తగా 520 మందికి మంజూరైన పింఛన్లను జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి అందజేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, పారదర్శకంగా పెన్షన్లు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వలంటీర్లు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ప్రతి కుటుంబానికీ మేలు చేస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- అంబాజీపేట మండలం మాచవరంలో జరిగిన కార్యక్రమంలో కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్లను ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు మట్టా పార్వతి పంపిణీ చేశారు.
- అయినవిల్లి, కె.జగన్నాథపురం గ్రామాల్లో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచులు కాకర శ్రీనివాస్, మేడిశెట్టి ఉషారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు తదితరులు పాల్గొన్నారు.
- మలికిపురం గ్రామంలో కొత్తగా మంజూరైన 21 పింఛన్లను సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి లబ్ధిదారులకు అందజేశారు. సంక్షేమ పథకాల అమలులో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దేశంలోనే అగ్రగామిగా ఉందని ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుబ్బల బాబ్జీ, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కోళ్ల వేణుప్రసాద్, కార్యదర్శి తాడి వర్మ, కో ఆప్షన్ సభ్యులు కబీర్, కన్వీనర్ విజయ్‌కుమార్, పార్టీ నేతలు కేఎస్ఎన్ రాజు, గెడ్డం తులసీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ న్యాయమూర్తులను అవమానించడం టీడీపీకి తగదు



సమావేశంలో పాల్గొన్న బాబ్జీ, బీసీ నేతలు

మలికిపురం: బీసీ న్యాయమూర్తులను అవమానిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని రాజోలు నియోజకవర్గ బీసీ నాయకుల సమావేశం హెచ్చరించింది. మలికిపురంలోని అంబేద్కర్ పూలే భవనంలో గురువారం జరిగిన సమావేశానికి బీసీ సాధికార సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుబ్బల బాబ్జీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్కిల్ స్కామ్ కేసులో అరెస్టయిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి రిమాండు విధిస్తూ ఏసీబీ కోర్టు జడ్జి బొక్కా హిమబిందు తీర్పు చెప్పారని గుర్తు చేశారు. ఈ క్రమంలో బీసీ మహిళ అయిన ఆమెను టీడీపీ శ్రేణులు మీడియాలో, సోషల్ మీడియాలో అగౌరపరుస్తూ, అవమానకరంగా దాడి చేస్తూండటం అభ్యంతరకరమని పేర్కొన్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులుగా బీసీలు పనికిరారంటూ గతంలో సీఎంగా ఉన్న కాలంలో చంద్రబాబు కేంద్ర న్యాయశాఖకు లేఖ రాసిన విషయం అందరికీ తెలిసిందేనని గుర్తు చేశారు. బీసీల విషయంలో వైఖరి మార్చుకోవాల్సి ఉండగా, నేడు అదే వర్గానికి చెందిన జడ్జి హిమబిందును అగౌరవపరుస్తూ ట్రోల్ చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని చెప్పారు. హిమబిందును అవమానిస్తున్న వారిని పోలీసులు గుర్తించి, తగు చర్యలు తీసుకుని, కట్టడి చేయాలని డిమాండ్ బాబ్జీ చేశారు. ఈ సమావేశంలో రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు దొమ్మేటి ఉమా మహేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పాటి శివ, నియోజకవర్గ బీసీ శాంతి సంఘం ప్రధాన కార్యదర్శి గుబ్బల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో క్రీడా సంబరాలు

- నందడిగా స్కూల్ గేమ్స్ ఆటల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

మామిడికుదురు/పి.గన్నవరం/అంబాజీపేట/సఖినేటిపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మండల స్థాయి ఆటల పోటీలు వివిధ పాఠశాలల్లో గురువారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. అండర్–14, 17 విభాగాల్లో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మామిడికుదురు జెడ్పీ హైస్కూలులో వాలీబాల్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగా, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. మండలంలోని 12 పాఠశాలల నుంచి 225 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పిరమిడ్ ఆకారంలో నిల్చుని జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ విద్యార్థులు చేసిన విన్యాసం విశేషంగా ఆకట్టుకుంది. మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ మట్టా శ్రీధర్ పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో ఎంఈఓ మోకా వెంకన్నబాబు, పీఎంసీ చైర్మన్ మట్టా వెంకటేశ్వరరావు, హెచ్ఎం సీహెచ్ నిరంజని తదితరులు పాల్గొన్నారు. యోగా పోటీల్లో పాశర్లపూడిలంకలోని బొరుసు తిరుపతయ్య మెమోరియల్ జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ప్రతిభ చూపారు. బాలుర విభాగంలో కౌరు విజయకుమార్, ముత్యాల జయసాయి, బావిశెట్టి సతీష్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు తెలిపారు. బాలికల విభాగంలో అల్లు రమ్య, పోతుల విజయలక్ష్మి ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించి, నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను సర్పంచ్ ప్రకాశరావు, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.



యోగాలో ప్రతిభ చూపిన పాశర్లపూడిలంక విద్యార్థులు

- పి.గన్నవరం జెడ్పీ హైస్కూలులో బాలురకు ఎనిమిది విభాగాల్లో నిర్వహించిన పోటీలను సర్పంచ్ బొండాడ నాగమణి ప్రారంభించారు. బాలికలకు శుక్రవారం పోటీలు నిర్వహించనున్నామని క్రీడా పోటీల సమన్వయకర్త కేవీ రమణ తెలిపారు. ఎంఈఓలు కోన హెలీనా, చింతా వీరభద్రం, హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు, పీడీలు కె.భీమేంద్ర, ఎస్.కమల్, వై.సతీష్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.
- అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఎంఈఓ మోకా ప్రకాష్, హెచ్ఎం కడలి సాయిరామ్ ఆధ్వర్యాన ఆటల పోటీలను ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి ప్రారంభించారు. పీడీలు కె.ఆదిలక్ష్మి, అందె సూర్యనారాయణ, పీఈటీల పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. బాలుర విభాగం అండర్–17 ఖోఖోలో పుల్లేటికుర్రు, తొండవరం; బ్యాడ్మింటన్‌లో పుల్లేటికుర్రు, తొండవరం; వాలీబాల్‌లో ముక్కామల, అంబాజీపేట; కబడ్డీలో కె.పెదపూడి, గంగలకుర్రు; టెన్నికాయిట్‌లో ముక్కామల, ఇసుకపూడి పాఠశాలల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అలాగే అండర్–14 ఖోఖోలో పుల్లేటికుర్రు, తొండవరం; బ్యాడ్మింటన్‌లో పుల్లేటికుర్రు, తొండవరం; వాలీబాల్‌లో ఇరుసుమండ, అంబాజీపేట; కబడ్డీలో ఇరుసుమండ, గంగలకుర్రు; టెన్నికాయిట్‌లో ఇసుకపూడి, ముక్కామల పాఠశాలల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. వీరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.
- సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం, అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడాపోటీలు ఎంఈఓ–1 డి.కిషోర్ కుమార్ ఆధ్వర్యాన నిర్వహించారు. అంతర్వేదికరలో పోటీలను పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతురాజు నాగేంద్ర కుమార్ ప్రారంభించారు. బాలురకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు; బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, యోగా విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వ్యాయామోపాధ్యాయులు శుభాకర్, కృష్ణప్రసాద్, సురేష్, గెజిటెడ్ హెచ్ఎంలు సుజాత, సూర్యకుమారి పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్

కొత్తపేట: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ శుక్రవారం ప్రారంభమవుతాయని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, గేమ్స్ కో ఆర్డినేటర్ వైఎస్ఎస్ ఉషారాణి గురువారం తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఈ పోటీలను ప్రారంభిస్తారన్నారు. శుక్రవారం బాలురు, శనివారం బాలికల గేమ్స్ జరుగుతాయని తెలిపారు.

సంక్షేమ రథసారథి సీఎం జగన్

- రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- పొదలాడలో గడప గడపకూ మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు నిరాటంకంగా అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ రథసారథిగా కీర్తి గడించారని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. పొదలాడలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. అల్లూరు సీతారామరాజు స్కూల్, బుడగ జంగాల కాలనీ, మెయిన్ రోడ్డు, బీసీ కాలనీ, పాలగుమ్మి రోడ్డు తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే రాపాకతో పాటు ఆయన కుమారుడు వెంకటరామ్ గడప గడపకూ తిరుగుతూ.. జగన్‌ను మళ్లీ సీఎంగా విజయపథంలో నిలపాలని కోరారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందిస్తూ సీఎం జగన్ ప్రజల గుండెల్లో నిలిచారని ఎమ్మెల్యే రాపాక అన్నారు. గ్రామ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు నిర్మించి, పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించారని చెప్పారు. ఆరోగ్య శ్రీ పథకంలో అనేక మార్పులు తీసుకువచ్చి, ఒక్క రూపాయి ఖర్చు కాకుండా కార్పొరేట్ స్థాయి ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తున్నారన్నారు. వ్యవసాయం, విద్యా రంగాల్లో సమూల మార్పులు తీసుకు వచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు చెల్లింగి లక్ష్మీ ఈశ్వరి, మాజీ ఎంపీటీసీ గెడ్డం సురేష్, నాయకులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ తీరు దుర్మార్గం

మలికిపురం: అవినీతి ఎక్కడుంటే అక్కడ పోరాటం చేస్తానన్న పవన్ కల్యాణ్ అవినీతి కేసులో అరెస్టయ్యి, జైలులో ఉన్న చంద్రబాబు నాయుడుకు, టీడీపీకి వత్తాసు పలకడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మంగెన సింహాద్రి దుయ్యబట్టారు. లక్కవరంలో గురువారం ఆయన మాట్లాడుతూ, జనసేన కార్యకర్తల ఆత్మాభిమానాన్ని, కులాన్ని చంద్రబాబుకు పవన్ కల్యాణ్ తాకట్టు పెట్టడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తద్వారా వారి మనోభావాల్ని దెబ్బ తీశారని అన్నారు.

ప్రతి గ్రామం.. అభివృద్ధి పథం

- కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- కొత్తపేటలో సచివాలయ భవనం ప్రారంభం

కొత్తపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో పయనిస్తోందని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం–4 నూతన భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షతన జరిగిన సభలో జగ్గిరెడ్డి మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కేవలం మాటలకే పరిమితమైందని గుర్తు చేశారు. ప్రజాధనాన్ని ఎలా కొల్లగొట్టాలనే దృక్పథంతోనే పాలన సాగించారని విమర్శించారు. నేటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెప్పింది చెప్పినట్టుగా ఆచరణలో చూపిస్తోందని చెప్పారు. పరిపాలనను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. నియోజకవర్గంలో సుమారు రూ 30.45 కోట్లతో సచివాలయాలకు నూతన భవనాలు నిర్మించామని తెలిపారు. వాటికి అనుసంధానంగా రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు రైతుభరోసా కేంద్రాలు, పేదలకు వైద్య సేవలందించేందుకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతీ సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.20 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.



సచివాలయ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విప్ జగ్గిరెడ్డి

ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం

రాష్ట్రంలో పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక నాలుగో సచివాలయం పరిధిలో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి, ఆయా లబ్ధిదారులకు వర్తించిన పథకాలను వివరిస్తూ బుక్‌లెట్ అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం, ఎమ్మెల్యే జగ్గిరెడ్డిపై అభిమానం వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబాల్లో వెలుగులు తీసుకురావడమే లక్ష్యంగా సీఎం జగన్ పని చేస్తున్నారని ఆయనన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ అందరూ ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే సీఎం ఆకాంక్ష అని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన

ఆత్రేయపురం: సీఐడీ ఏఎస్పీ ఎం.కృష్ణమూర్తి నాయుడు అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ సాధికారత, అట్రాసిటీ చట్టంపై పేరవరంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర నేర పరిశోధన విభాగంలోని పౌర హక్కుల రక్షణ సెల్, పోలీసు విభాగాల సంయుక్త ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లం ఆనంద్ ప్రకాష్, సీఐడీ విభాగం స్టాండింగ్ కౌన్సిల్, స్పెషల్ పీపీ సోమసాని ఝాన్సీలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 30వ తేదీన అన్ని మండలాల్లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలన్నారు. చట్టంలోని వివిధ సెక్షన్లను సీఐడీ ఏఎస్పీ ఎం.కృష్ణమూర్తి నాయుడు, కొత్తపేట ఎస్‌డీపీఓ కె.వెంకట రమణ, సీఐడీ డీఎస్పీలు సీహెచ్ పెంటారావు, బి.రామకృష్ణ, జేమ్స్ రత్నప్రసాద్ వివరించారు. ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. జెడ్పీటీసీ బోణం సాయిబాబు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడే ముద్దు

రావులపాలెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడినే పూజించాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా దేవరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమల తయారీలో గురువారం శిక్షణ ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయుడు, జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి పడాల లింగేశ్వరరెడ్డి ఆధ్వర్యాన విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసి, పంపిణీ చేశారు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణం, నీరు కలుషితమవుతాయని హెచ్ఎం భమిడిపాటి సాయిరాం వివరించారు. 'మట్టి వినాయకుడే ముద్దు.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయకుడు వద్దు' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల పీఎంసీ చైర్మన్ బొక్కా నాగప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రీసర్వే స్టోన్ ప్లాంటేషన్ పరిశీలన

రాజోలు: పొదలాడలో జరుగుతున్న స్టోన్ ప్లాంటేషన్ పనులను సర్వే శాఖ ఏడీ ప్రభాకర్ గురువారం పరిశీలించారు. గ్రామాల్లోని అన్ని పంట పొలాలను సర్వే చేసి, హద్దులు నిర్ణయించి, స్టోన్ ప్లాంటేషన్ చేస్తున్నామన్నారు. గ్రామాల మధ్య సరిహద్దులు కూడా సర్వే చేశామన్నారు. పొదలాడ, సోంపల్లి, చింతలపల్లి, తాటిపాక, రాజోలు, పాలగుమ్మి, ములికిపల్లి గ్రామాల్లో రీసర్వే పనులు జరుగుతున్నాయన్నారు.

ఇసుక తరలింపుపై వివాదం

మామిడికుదురు: పాశర్లపూడిలంకలో విద్యుత్ సబ్ స్టేషన్ స్థలం లెవెలింగ్‌కు సిద్ధం చేసిన ఇసుక తరలింపు వివాదానికి దారి తీసింది. ఇక్కడి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారంటూ సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, స్థానికులు గురువారం ఆందోళన చేశారు. లూటుకుర్రులో పీహెచ్‌సీ అభివృద్ధి పనులకు ఈ ఇసుకను తరలించారు. ఇది భావ్యం కాదని సూర్యప్రకారావు మండిపడ్డారు. పీహెచ్‌సీ అభివృద్ధి పనులకు ఇక్కడి ఇసుకే కావాల్సి వచ్చిందా అని ప్రశ్నించారు. వర్షాకాలం కావడంతో వేరే చోట నుంచి ఇసుక తీసుకువచ్చే అవకాశం లేదని జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు తెలిపారు. పీహెచ్‌సీ పనులు నిలిచిపోవడం వల్లే ఇక్కడి ఇసుక తరలించామని, సబ్ స్టేషన్ స్థలం వద్ద ఇసుకను యథా ప్రకారం డంప్ చేస్తామని చెప్పారు.